క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: ఛత్రం సచివాలయం పరిధిలోని దిగువ ఈచలడ్డి గ్రామంలో గురువారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కవిత, సర్పంచ్ చిన్నయ్య, ఎంపీటీసీ హనుమంతరాయప్ప తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మెటీరియల్ పంపిణీ



మెటీరియల్స్ అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని కస్తూర్బా విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉర్దూ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీఓ నరేంద్ర, ఎంఈఓ గంగప్ప పాల్గొన్నారు. ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ సహకారంతో అజీజియా పాఠశాల ఉపాధ్యాయులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్స్‌ను అందజేశారు. వారు మాట్లాడుతూ సద్వినియోగం చేసుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. గురువులకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: స్థానిక శిరా రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద బుధవారం సాయంకాలం ఏఎస్‌ఐ రామంజనేయులు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులు పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఏఎస్‌ఐ వాహనదారులకు సూచించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి



భీష్మ పితామహుడి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: హిందూపురం బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కొటిపి రోడ్డులోని గంగమ్మ ఆలయంలో భీష్మ చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్త లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భరత వంశానికి ఆదిపురుషుడు, గంగపుత్రుడు, బెస్తల కుల పెద్ద భీష్మ పితామహుడని కీర్తించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆదినారాయణప్ప, శ్రీనివాస్, శివయ్య, అనిల్‌కుమార్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, నరసింహప్ప, రవికుమార్, బెస్తలు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి సిబ్బందికి సూచించారు. బుధవారం బసవనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన ప్రతి కూలికీ పనులు కల్పిస్తామన్నారు. చేసిన పనులకు వెంటనే బిల్లులు అందిస్తామన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది జాబ్ కార్డు కలిగిన వారిని వలంటీర్ల సహకారంతో గుర్తించి వారంతా పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం కూలీల మస్టర్ పరిశీలించి వారితో మాట్లాడారు. టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరాయప్ప ఉన్నారు.

విద్యార్థినులకు అభినందన



జగదీష్‌కు పర్సు అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: అచ్చంపల్లి నుంచి ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలకు బుధవారం వస్తున్న విద్యార్థినులు జ్యోతిబాయి, అక్షిత బాయి, రంజితబాయి, శైలజబాయి, యమున బాయిలకు మార్గ మధ్యంలో పర్సు దొరికింది. విద్యార్థినులు పర్సును పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉమేష్‌కు అందించారు. పర్సులో రూ.2,880 నగదుతో పాటు ఓటరు, పాన్, ఆధార్‌కార్డులు ఉన్నాయి. గొడనహళ్లి గ్రామానికి చెందిన జగదీష్‌దిగా గుర్తించి సదరు వ్యక్తిని పాఠశాలకు పిలిపించి పర్సును అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ



పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: దశాబ్దాల కాలంగా టీడీపీ నేతల అవినీతి అక్రమాలకు బలి అయ్యామని, జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా గుండెల్లో చెదిరిపోని స్థానాన్ని సంపాదించుకున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణతో బీచిగానిపల్లి ప్రజలు సంతోషాన్ని పంచుకున్నారు. బుధవారం మండలంలోని బీచిగానిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణతో పాటూ పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బాబురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా? లేదా అన్న విషయాన్ని తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మూడేళ్లలో ప్రభుత్వం ద్వారా వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేసి, బుక్‌లెట్లను అందజేశారు.

భారీ బైక్ ర్యాలీ..

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎన్నికల పరిశీలకులు బాబురెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నాయకులు ప్రభాకర్, గంగరాజు, యోగానందరెడ్డి, చిక్కేగౌడ, మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నరసింహారెడ్డి (చంటి), మాజీ కన్వీనర్ జయరాం తదితరుల ఆధ్వర్యంలో గొల్లపల్లి నుంచి బీచిగానిపల్లి వరకూ దాదాపు 3 కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రతి గడపలోనూ సంతోషం

గడప గడపలోనూ ప్రభుత్వ పాలనపై సంతోషం వ్యక్తం అవుతోందని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటా ఆర్థిక లబ్ధి చేకూరడంతో పాటూ డబ్బును వినియోగించుకుని, ప్రజల జీవనోపాధులు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నదే అన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులతో పాలన సాగిస్తున్నారు కాబట్టే దేశంలో ఏపీకి సంక్షేమ పథకాల అమలులో అగ్రస్థానంలో నిలబడేలా చేసిందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా, రాజకీయాల్లో ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజల గుండెల్లో చెదిరిపోని నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరామప్ప, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, ఏఓ విజయభారతి, హౌసింగ్ డీఈ నాగరాజు, మాజీ సర్పంచ్ నాగరాజు, డీలర్ నాగరాజు, మారుతీ, పంచాయతీ కన్వీనర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

సోమందేపల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో గృహ సారథులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్లకు సమాంతరంగా ప్రభుత్వం గృహ సారథుల వ్యవస్థకు శ్రీకారం చుటిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాల కుట్రల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి, తదితరులున్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

పరిగి: రాష్ట్ర ప్రజలకు కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్న లక్ష్యంతో జగనన్న పాలన సాగిస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత ఇంటిని నిర్మిస్తామని చెప్పిన హామీని నిజం చేశారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మండలంలోని బీచిగానిపల్లిలో జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం ద్వారా మంజూరైన జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూజజ నియోజకవర్గంలో రెండో దశలో బాగంగా అహుడా పరిధిలోని గ్రామాలన్నింటిలో దాదాపు 2 వేలకు పైగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న కాలంలో శాచురేషన్ పద్ధతిలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లను నిర్మిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్ : బాబురెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు బాబురెడ్డి అన్నారు. ఎమ్మెల్యే చూపుతున్న ప్రత్యేక చొరవతో నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి జరుగుతుండటం ఆనందదాయకమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం జగనన్న ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ హరి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ సరస్వతి, జెడ్పీటీసీ శ్రీరామప్ప తదితరులున్నారు.

నివాళి..

గోరంట్ల: పాలసముద్రం పంచాయితీ ఉప సర్పంచ్ శివమ్మ భర్త అంజినప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంజినప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర రెడ్డి, సర్పంచ్ కాటిపల్లి చిన్నగంగప్ప ,పంచాయితీ పార్టీ కన్వీనర్ గోవిందరెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు సామలపల్లి రాము, బాబు పాల్గొన్నారు.

స్వావలంబన దిశగా సోలార్ సేవలు

పావగడ: తిరుమణి సోలార్ పార్క్‌లో ఏడాది నుంచి పోట్రమ్, సీడ్ కంపెనీల పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి యోజనలతో సామాన్య ప్రజలు స్వాలంబనగా జీవిస్తున్నారని సోలార్ కంపెనీ సీహెచ్‌ఆర్వో రణవీర్ తెలిపారు. తిరుమణి సోలార్ పార్క్‌లో బుధవారం నిర్వహించిన సామాజిక అభివృద్ధి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 113 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, 158 మందికి కంప్యూటర్ శిక్షణ అందించామన్నారు. ఆరోగ్య శిబిరాల్లో 593 మంది రోగులకు ఉచిత ఆరోగ్య సేవలందించామన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ స్పోకన్ తరగతులు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. కంపెనీ ముఖ్య వ్యవస్థాపకులు అవినాశ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రియాంక కంపెనీలు అందిస్తున్న సౌలభ్యాలు గురించి మాట్లాడారు. ప్రాజెక్ట్ లీడర్ అమిత్ పాండే, పదాధికారులు గోపాల్, అమిత్ జైన్,లోకేశ్ చౌదరి,అరుణ్ కుమార్, విజయభాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన



స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: గుర్రపుకొండ ఎస్సీ కాలనీలో బుధవారం వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కారుణ్య, ఎంపీపీ కవిత, ఎంపీటీసీ మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్, రంగనాథ్, వెంకటరమణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట..

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లి తండాలో బుధవారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మ వారికి జోతులను ఊరేగించారు. ప్రత్యేక పూజలు, హోమలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర నారాయణ పాల్గొని అమ్మా వారికి పూజలు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీలమ్మ, స్థానిక వైసీపీ నాయకులు శ్రీనివాస నాయక్, వెంకటకృష్ణారెడ్డి , జయరామిరెడ్డి, గోరంట్ల సహకార సంఘం అధ్యక్షుడు శివశంకరరెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానిక వాసవీ మాత దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వాసవీ మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర నారాయణ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న మ్యూజియంను ప్రారంభించారు. జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు బలరాం గుప్తా, జనార్ధన గుప్తా, విజయకుమార్, సూర్యప్రకాష్, తదితరులున్నారు.

వెంకటరెడ్డిపల్లిలో పొలం బడి

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి ఆర్బీకే పరిధిలోని రైతు గోపాల్ పొలంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు వైఎస్సార్ పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు, రసాయన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీ స్వయంప్రభ, వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

గోరంట్ల: కరావులపల్లిలో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న కరావులీశ్వర దేవాలయ నిర్మాణానికి బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. కరావులపల్లి తండాకు చెందిన మోహన్‌నాయక్ రూ.50,116, కరావులపల్లి తండాకు చెందిన టీచర్ రంగానాయక్ రూ.50,116, మందలపల్లి ఎంపీటీసీ సభ్యుడు నాగేనాయక్ రూ.25,116 చొప్పున విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, గొల్లశ్రీరాములుకు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, బాబునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సెరికల్చర్ ట్విస్టింగ్ యూనిట్లతో ఇబ్బందులు

హిందూపురం టౌన్: పట్టణంలోని కోట ఏరియాలో ఉన్న బీరువాల తయారీ, సెరికల్చర్ ట్విస్టింగ్ యూనిట్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఏరియా వాసులు షువేబ్, నయాజ్, షాజహాన్, ఉమర్, జావీద్ తదితరులు వాపోయారు. దీనిపై కలెక్టర్ బసంత్ కుమార్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుధవారం కమిషనర్ వెంకటేశ్వరరావు కోట ఏరియాలో పర్యటించి పరిశీలించారన్నారు. నేతాజీ ప్రభుత్వ పాఠశాలకు సమీపంలోనే ఇవి ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతూ అనారోగ్యం బారినపడుతున్నారన్నారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించండి

రొళ్ల: అడిగిన ప్రతి కూలీకి ఉపాధి హామీ కింద పనులు కల్పించాలని ఎంపీడీఓ రామారావు సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ నాగరాజుతో కలిసి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోను కూలీల హాజరు పెంపుపై ఎఫ్ఏలు శ్రద్ధ వహించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీరు, నీడతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. మండలంలో రోజుకు 2వేల మందికి పనులు కల్పించాలన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన

గుడిబండ: మండల కేంద్రంలో బుధవారం తుమ్మల మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించి గ్రామస్తులందరూ కలిసి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అనంతరం మహిళలు ఉపవాసంతో జ్యోతులు మోసుకుంటూ ఊరేగింపుగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఎగువ అచ్చంపల్లిలో డీఎస్పీ పర్యటన

మడకశిరరూరల్: ఎగువ అచ్చంపల్లి గ్రామంలో పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు సేకరించడానికి మరోసారి గ్రామానికి వస్తానని డీఎస్పీ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ నాగేంద్ర ఉన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: ఉత్తమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే వెంకటరమణప్ప ప్రశంసించారు. స్థానిక గురుభవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఉత్తమ సమాజాన్ని దేశానికి అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైనదన్నారు. మాజీ జెడ్పీ సభ్యుడు హెచ్‌వీ వెంకటేష్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులు, వైద్యుల వృత్తి గొప్పదన్నారు. బీఈఓ అశ్వర్థనారాయణ మాట్లాడుతూ త్వరలో వార్షిక పరీక్షలు వస్తున్నాయని, విద్యార్థులను ఉత్తమ రీతిలో పరీక్షలకు సిద్ధం చేసే బాధ్యత హెచ్‌ఎంలదేనని తెలిపారు. సంపన్మూల వ్యక్తి ప్రొఫెసర్ శశికుమార్, బీఆర్సీ పవన్‌కుమార్ రెడ్డి, ఈసీఓ శివమూర్తినాయక్, ఉపాధ్యాయ సంఘాల పదాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాచీదేవ జయంత్యుత్సవాలు



ఊరేగింపుగా వస్తున్న మడివాళ కులస్తులు

అమరాపురం: చిట్నడకు గ్రామంలో బుధవారం రజకులు, మడివాళ కులస్తుల ఆరాధ్య దైవం మాచీదేవ జయంత్యుత్సవాలను ఆ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం మాచీదేవునికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మడివాళ కులస్తులు కలశాలతో ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో ఆలయం చేరుకున్నారు. అక్కడ కలశాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాచీ దేవుని విగ్రహని అభిషేకం తదితర పూజలు చేసి అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

పావగడ: రజకుల ఆరాధ్య దైవమైన మడివాళ మాచదేవ జయంత్యుత్సవాలు స్థానిక తాలూకా కార్యాలయంలో బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు మడివాళ మాచదేవ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ వరదరాజు, కసబ హోబళి ఆర్ ఐ రాజగోపాల్, రజక సంఘం నాయకులు కిరణ్, శ్రీరామప్ప, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

పెనుకొండ రూరల్: దుద్దేబండ పంచాయతీలోని సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిని సబ్ కలెక్టర్ కార్తీక్ బుధవారం పరిశీలించారు. ఇటీవల స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల మేరకు భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమతులు లేకుండా భూమిలో చదును పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ స్వర్ణలత ఉన్నారు.

సచివాలయం తనిఖీ

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి ఒకటో నంబర్ సచివాలయాన్ని బుధవారం ధర్మవరం డివిజినల్ పంచాయతీ అధికారి శివారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాయంలోని విజిటర్స్ రిజిష్టర్, మూమెంట్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిష్టర్‌ను క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమలో ఎంపీడీఓ రఘునాథగుప్తా పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

పెనుకొండ: జాతీయ సమైక్యత శిబిరానికి పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జర్నలిజం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పవన్ కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. కర్ణాటకలోని మైసూర్‌లో ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకూ వారం రోజుల పాటు జాతీయ సమైక్యతా శిబిరం జరుగుతుందన్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఎస్కే యూనివర్సిటీ నుంచి 5 మంది ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపిక కాగా.. శ్రీసత్యసాయి జిల్లా నుంచి పవన్ కుమార్ ఎంపికయ్యాడన్నారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి



వివరాలను వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ సభ్యులు

మడకశిరరూరల్: ఉపాధి పనుల్లో పారదర్శకతను పాటించాలని డ్వామా పీడీ రామాజినేయులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదిక సభకు డ్వామా పీడీతోపాటు విజిలెన్స్ అధికారి రమణారెడ్డి హాజరయ్యారు. మండలంలో ఉపాధి హామీ ద్వారా 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన రూ.11 కోట్లు పనులకు పంచాయితీల వారీగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ వివరాలను వెల్లడించారు. 16 పంచాయితీ పరిధిలో ఉపాధి సిబ్బంది నుంచి దాదాపు రూ.37వేలు నిధులు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు ఉపయోగపడే పనులు చేపట్టి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఎంపీడీఓ సోనిబాయి, ఎంపీపీ కవిత, ఏపీఓ శ్రీకాంత్‌గౌడు, క్షేత్ర స్థాయి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

నేడు గృహ సారథులతో సమావేశం

పెనుకొండ: పట్టణంలోని వన్షికా ఫంక్షన్ హాల్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ, వార్డు వలంటీర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు బోయ నరసింహ, నాగలూరు బాబు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరవుతారన్నారు.

మడకశిర: స్థానిక మార్కెట్ యార్డులో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గృహసారథులు, కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ తెలిపారు. వైబీహళ్లి, గోవిందాపురం, జీబీపాళ్యం, గుండుమల, మెళవాయి, కదిరేపల్లి, బుళ్లసముద్రం, ఆమిదాలగొంది సచివాలయాలకు సంబంధించిన కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, మండల జగనన్న సచివాలయం కన్వీనర్ తప్పక హాజరు కావాలన్నారు.

రక్తదానం

హిందూపురం టౌన్: రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ హిందూపురం డిపో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఆస్పత్రిలో ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వాస్పత్రి వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 28 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతో మంది ప్రాణాలను కాపాడుకోగలమన్నారు. అలాగే రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని సూచించారు. ఓ వ్యక్తి ప్రమాదానికి గురైతే అతడిపై ఆధారపడిన కుటుంబం మొత్తం రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, రోడ్డుపై ప్రయాణించే సమయంలో నిబంధనలు పాటించాలని అన్నారు.

కష్టపడితే మంచి మార్కులు

హిందూపురం టౌన్: చదువును ఇష్టపడి కష్టపడితే మంచి మార్కులు సాధించగలరని ఎంపీడీఓ నరేంద్ర, ఎంఈఓ గంగప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. నాడు–నేడు నిధుల వివరాలు, ఎంత పని జరిగింది అనే విషయాలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇష్టపడితే ఎంతటి కష్టమైన సబ్జెక్ట్ అయినా సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మడకశిరరూరల్: గ్రామ వలంటీర్ల విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని బుధవారం ఎంపీడీఓ సోనిబాయి హెచ్చరించారు. జీవీ పాళ్యం సచివాలయం పరిధిలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు వలంటీర్లుకు మెమోలు జారీ చేశారు. మూడు రోజుల లోపు సదరు వలంటీర్లు మండల పరిషత్ కార్యాలయంలో సంజాయిషీ ఇవ్వాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మడకశిర: రొళ్ల మండలం ఎం రాయాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బుధవారం జై భారత యువ సేన ప్రతినిధులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి వినతి పత్రం అందజేశారు. మడకశిర నుంచి రొళ్ల, మధూడి, కరిదాసనహళ్లి మీదుగా ఎం రాయాపురం గ్రామానికి బస్సు నడపాలని కోరారు. అలాగే గుడిబండ, మందలపల్లి హునిసేకుంట మీదుగా ఎం రాయాపురం వరకూ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అధికారులతో మాట్లాడి బస్సులు నడిపేలా చూస్తామన్నారు. యువసేన సభ్యులు గోవిందప్ప, బాలరాజు, మంజునాథ్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

తెగులు నివారణపై అవగాహన

హిందూపురం: హిందూపురం రూరల్ మండలంలోని మనేసముద్రం గ్రామానికి బారిక క్రిష్టప్ప మొక్కజొన్న పంటను బుధవారం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పరిశీలించారు. పంటకు ఎండు తెగులు ఆశించిందన్నారు. నివారణకు హెక్సాఅనకోనజోల్ అనే మందును 2 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి లేదా కార్బండిజైమ్ గ్రామును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పైరు 20 రోజులు 40 రోజుల మధ్యలో ఎకరానికి బస్తా యూరియా వేయాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, ఏఈఓ శంకర్ పాల్గొన్నారు.